


జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




| ఆదివారం 26 ఏప్రిల్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 328 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|

# ఆర్టీసీ కార్మికుల సమస్యలపై సానుకూల నిర్ణయాలు – గుర్తింపు ఎన్నికలకు ప్రభుత్వం అంగీకారం

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క





సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రతినిధి: ఆర్టీసీ కార్మికుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఆర్టీసీ మన కుటుంబమని, దురదృష్టవశాత్తు కుటుంబ సభ్యుడిని కోల్పోవడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రభుత్వం కార్మికుల సమస్యలపై చర్చించి సానుకూల నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. ఆర్టీసీ గుర్తింపు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం అంగీకరించిందని, ఎన్నికల ఏర్పాట్లను వెంటనే ప్రారంభించాలని ఆర్టీసీ యాజమాన్యాన్ని ఆదేశించినట్లు వెల్లడించారు. దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న ఆర్టీసీ విలీనం అంశంపై సుదీర్ఘ చర్చలు జరిగాయని చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి నాయకత్వంలో మంత్రులు శ్రీధర్ బాబు, వివేక్ వెంకట్ స్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సిఎస్ మరియు అధికారుల బృందం ఆర్టీసీ జేఏసీతో చర్చలు జరిపినట్లు తెలిపారు. ఉదయం ఐఏఎస్ అధికారులతో చర్చల అనంతరం ఉప ముఖ్యమంత్రితో సమస్యలపై సమగ్రంగా చర్చించామని చెప్పారు. ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం పరస్పర అంశాలను అర్థం చేసుకుని నిర్ణయాలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. కార్మికులు సమ్మెను విరమించుకోవడం పట్ల ప్రభుత్వం ధన్యవాదాలు తెలిపింది. ఆర్టీసీ సంస్థ భవిష్యత్తులో దేశంలో ప్రజా రవాణా రంగంలో ముందుండాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్టీసీ విలీనంపై అధికారుల కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పీఆర్సీ అంశంపై 11 శాతం వేతన సవరణ ప్రకటించినట్లు చెప్పారు. మిగతా సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ యాజమాన్యం, కార్మిక సంఘాలు చొరవ తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది.



# స్కైరూట్ ఏరోస్పేస్ విక్రమ్-1 రాకెట్ ఫ్లాగ్ ఆఫ్ – ఏరోస్పేస్ రంగంలో తెలంగాణకు కొత్త దిశ: సీఎం రేవంత్ రెడ్డి

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రతినిధి: శంషాబాద్‌లోని జీఎంఆర్ ఏరోస్పేస్ పార్క్‌లో స్కైరూట్ ఏరోస్పేస్ కంపెనీకి చెందిన విక్రమ్-1 రాకెట్ ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రాకెట్‌ను ఫ్లాగ్ ఆఫ్ చేయడంతో పాటు స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థను పరిశీలించారు. కార్యక్రమానికి మంత్రి శ్రీధర్ బాబు హాజరయ్యారు. అనంతరం సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ద్వారా ఏరోస్పేస్ రంగానికి అవసరమైన నైపుణ్యవంతులను తయారు చేయనున్నట్లు తెలిపారు. ఆనంద్ మహీంద్రా బోర్డు ఛైర్మన్‌గా స్కిల్ యూనివర్సిటీని అభివృద్ధి చేస్తున్నామని, ఏరోస్పేస్ రంగానికి అవసరమైన మానవ వనరులను అందించేందుకు ప్రత్యేక కోర్సులు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఐటీఐలను టాటా గ్రూప్ సహకారంతో ఏటీసీ కేంద్రాలుగా మారుస్తున్నామని, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా సిలబస్‌ను మార్చుతున్నామని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థను సమూలంగా మారుస్తూ, విద్యార్థులపై ప్రభుత్వం సగటున లక్షా ఎనిమిది వేల రూపాయలు ఖర్చు చేస్తోందని తెలిపారు. మల్లేపల్లి ఏటీసీ కేంద్రాన్ని సందర్శించాలని అధికారులను ఆదేశించారు. ఇదే కార్యక్రమంలో స్కిల్ యూనివర్సిటీ సేవలను ఏరోస్పేస్ రంగానికి విస్తరించాలని సీఎం సూచించారు.

ఇక ఇదే సందర్భంలో ఐసీసీసీలో సీఎం రేవంత్ రెడ్డిని డీజీపీ ర్యాంక్‌కు ప్రమోషన్ పొందిన సీనియర్ ఐపీఎస్ అధికారులు వి.వి. శ్రీనివాసరావు, స్వాతి లక్రా, మహేష్ భగవత్, చారు సిన్హా, డా. అనిల్ కుమార్, వి.సి. సజ్జనార్ మర్యాదపూర్వకంగా కలిశారు.

# రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై ప్రజా ప్రతినిధులతో మంత్రి పొంగులేటి క్షేత్రస్థాయి సమీక్షలు – నేడు ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో సమావేశాలు



సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రతినిధి: ఇందిరమ్మ ఇళ్లు, రెవెన్యూ అంశాలపై రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం నుంచి క్షేత్రస్థాయి సమీక్షలకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ మేరకు హిమాయత్‌నగర్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉదయం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా, మధ్యాహ్నం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజా ప్రతినిధులు, కలెక్టర్లతో సమీక్షా సమావేశాలు నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలపై దశలవారీగా ఇటువంటి సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తొలి విడతగా మూడున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కాగా, సుమారు లక్షకు పైగా ఇళ్లు గృహప్రవేశాలకు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో ఈ సమీక్షకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని పేర్కొన్నారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పూర్తి, కేటాయింపు, మౌలిక వసతుల కల్పన అంశాలపై కూడా చర్చ జరగనుంది. అలాగే రెండవ విడత ఇళ్ల మంజూరు అంశంపై కూడా సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. భూ వివాదాలు, పట్టాదారు పాస్ పుస్తకాల జారీ, భూధార్, సర్వే మ్యాప్‌ల అమలు వంటి కీలక రెవెన్యూ అంశాలపై కూడా మంత్రి సమగ్ర సమీక్ష చేయనున్నారు. ఈ సమావేశాల్లో ఆయా జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, హౌసింగ్ అధికారులు పాల్గొననున్నారు

# సెన్సస్ 2027: రేపటి నుంచే సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రారంభం – పౌరుల భాగస్వామ్యంతో డిజిటల్ గణనకు పిలుపు

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రతినిధి: దేశ భవిష్యత్ ప్రణాళికలు, విధాన రూపకల్పనలో కీలకమైన భారత జనాభా గణన (సెన్సస్) 2027లో భాగంగా ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు సెల్ఫ్ ఎన్యుమరేషన్ (స్వయం గణన) కార్యక్రమం ప్రారంభమవుతుందని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పౌరులు తమ ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా కేవలం 15 నుండి 20 నిమిషాల్లో తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకోవచ్చని, ఇందుకోసం se.census.gov.in పోర్టల్‌ను వినియోగించాలని సూచించారు. తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (CURE) పరిధిలోని జీహెచ్‌ఎంసీ, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లు మరియు సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఏప్రిల్ 26న రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి వంటి ప్రముఖుల ద్వారా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే 19,865 హౌస్ లిస్టింగ్ బ్లాకులను డిజిటల్‌గా సిద్ధం చేశామని, 21,866 ఎన్యుమరేటర్లు, 3,662 సూపర్‌వైజర్లకు శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. "మీ సమాచారం – మన రేపు" అనే నినాదంతో ఈ కార్యక్రమం కొనసాగుతుందని, కనీసం 5 శాతం పౌరులు స్వయంగా గణనలో పాల్గొనేలా ఐటీ కారిడార్లు, అపార్ట్‌మెంట్లలో ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నామని కమిషనర్ వివరించారు.

# తెలంగాణ స్కిల్ రంగానికి జాతీయ స్థాయి గుర్తింపు – DETకు 'అవార్డింగ్ బాడీ' హోదా లభించింది





సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రతినిధి: రాష్ట్ర ఉపాధి మరియు శిక్షణ శాఖ (DET) స్కిల్ రంగంలో కీలక మైలురాయిని సాధిస్తూ నేషనల్ కౌన్సిల్ ఫర్ వొకేషనల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (NCVET) నుండి జాతీయ స్థాయి 'అవార్డింగ్ బాడీ (AB-Dual)'గా అధికారిక గుర్తింపు పొందింది. ఈ నేపథ్యంలో 24 ఏప్రిల్ 2026న ఢిల్లీలో జరిగిన ఒప్పందంతో ఇకపై తెలంగాణలోనే శిక్షణ, పరీక్షలు నిర్వహించి జాతీయ స్థాయి సర్టిఫికెట్లు జారీ చేసే పూర్తి అధికారాన్ని DET పొందినట్లు అధికారులు తెలిపారు. కార్మిక, ఉపాధి, శిక్షణ మరియు ఫ్యాక్టరీస్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిశోర్ ఐఏఎస్ మార్గదర్శకత్వంలో ఈ ప్రక్రియ వేగంగా పూర్తయినట్లు పేర్కొన్నారు. ఆయన పర్యవేక్షణలో ఐటీఐలు, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు (ATCs) ఆధునీకరణతో రాష్ట్ర స్కిల్ వ్యవస్థకు కొత్త దిశ లభించిందని అధికారులు తెలిపారు. ఈ ఒప్పందంతో రోబోటిక్స్, ఎలక్ట్రిక్ వాహనాలు, డ్రోన్ టెక్నాలజీ, ఐఓటీ హెల్త్‌కేర్, స్మార్ట్ అగ్రికల్చర్, ఆగ్మెంటెడ్ రియాలిటీ/వర్చువల్ రియాలిటీ వంటి ఆధునిక కోర్సుల్లో శిక్షణ మరింత విస్తరించనుందని వెల్లడించారు. ఇప్పటికే ఆమోదం పొందిన స్టెమ్ ఆధారిత కోర్సుల ద్వారా యువతకు పరిశ్రమ స్థాయి అవకాశాలు మెరుగుపడనున్నాయి. కేంద్ర ఎంఎస్‌డీఈ కార్యదర్శి మరియు NCVET ఛైర్‌పర్సన్ దేబశ్రీ ముఖర్జీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఒప్పంద కార్యక్రమంలో DET అధికారులు పాల్గొన్నారు. ఈ అభివృద్ధి తెలంగాణ యువతకు గ్లోబల్ ఉద్యోగ అవకాశాలను మరింత పెంచుతుందని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణను స్కిల్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యం, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మార్గదర్శకత్వంలో ఈ విజయం సాధ్యమైందని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ మృతి అంత్యక్రియల్లో పాల్గొన్న ఎస్పీ



సందేశం టైమ్స్, నారాయణఖేడ్, ఏప్రిల్ 26, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ మాసాని వెంకటరాములు అంత్యక్రియల్లో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పాల్గొని పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేసి, పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏప్రిల్ 23న న్యాల్కల్ మండలం చాల్కి గ్రామం వద్ద విధులకు వెళ్తూ జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకటరాములు కొండాపూర్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఆయనకు రావలసిన అన్ని ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిఎస్పీ సైదా నాయక్, ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

## మేడికుందలో సెయింట్ డాన్ బాస్కో పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహణ – విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్న వేడుక





సందేశం టైమ్స్, వాట్పల్లి, ఏప్రిల్ 26, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వాట్పల్లి మండల పరిధిలోని మేడికుంద గ్రామంలో ఉన్న సెయింట్ డాన్ బాస్కో పాఠశాలలో వార్షికోత్సవం (అన్వల్ డే) శుక్రవారం ఘనంగా నిర్వహించగా, ఈ కార్యక్రమానికి వాట్పల్లి ఎస్ఐ లవ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ప్రోత్సహిస్తూ ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నాటకాలు, నృత్యాలు, గీతాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో తమ ప్రతిభను చాటుకుని ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. చిన్నారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయుల కృషి కీలకమని, విద్యార్థులు విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించాలని ఎస్ఐ సూచించారు. ఈ వేడుకలో పాఠశాల కరస్పాండెంట్ స్టీఫెన్, ఉపాధ్యాయులు జిమ్మి, అనిల్, ప్రశాంతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పేదల సొంతింటి కల సాకారం కోసం ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 26, ప్రతినిధి: పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకే ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. శనివారం నిజాంపేట మండలంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన లబ్ధిదారురాలు కంది పద్మ ఇంటిని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జిల్లాలో సమర్థవంతంగా అమలవుతోందని, నిరుపేదల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఇందిరమ్మ గృహాలు వారి స్వప్నాలను సాకారం చేస్తున్నాయని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా సొంత ఇంటి కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు ఈ పథకం ద్వారా నిజమైన లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిజాంపేట తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాజిరెడ్డి, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల ఆధునికీకరణకు పటిష్ట చర్యలు స్మార్ట్ ఫోన్ల పంపిణీతో సేవల పారదర్శకత పెంపు: మంత్రి వివేక్ వెంకటస్వామి



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 26, ప్రతినిధి: అంగన్వాడీ కేంద్రాల పనితీరును మరింత ఆధునికీకరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందని మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందుతున్న సేవలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అత్యాధునిక స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేస్తోందని చెప్పారు. ఈ క్రమంలో నర్సాపూర్ వెల్దుర్తి రోడ్‌లోని సాయి కృష్ణ ఫంక్షన్ హాల్‌లో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, గ్రంథాలయ చైర్మన్ చిలుమల సుహాసినిరెడ్డి, మున్సిపల్ చైర్మన్, జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి తదితరులతో కలిసి మంత్రి అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేసి, చిన్నారులకు యూనిఫాంలు అందజేశారు. అలాగే 1098 చైల్డ్ హెల్ప్ లైన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లోని కార్యకలాపాలను డిజిటలైజ్ చేయడం ద్వారా సేవల వేగం పెరుగుతుందని, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, ఆరోగ్య సేవలను ఈ స్మార్ట్ ఫోన్ల ద్వారా ఆన్లైన్‌లో నమోదు చేసి మరింత పారదర్శకత సాధించవచ్చని తెలిపారు. సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా అంగన్వాడీ టీచర్లు తమ బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వహించగలరని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.15 కోట్లు – ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు, బడిబాట కార్యక్రమంలో మంత్రి వివేక్ వెంకటస్వామి విస్తృత పర్యటన





సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 26, ప్రతినిధి: మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపాలిటీ నగరాభివృద్ధికి రూ.15 కోట్లు మంజూరు చేసినట్లు తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు మరియు భూగర్భ శాస్త్ర శాఖల మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. శనివారం నర్సాపూర్ పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీరాజ్ యాదవ్, గ్రంథాలయ చైర్మన్ చిలెమల సుహాసినిరెడ్డి, ఆర్డీవో రమాదేవి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి తదితరులతో కలిసి మంత్రి వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా నగరాభివృద్ధి పథకం కింద రూ.15 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం నర్సాపూర్ మున్సిపాలిటీ 4, 6 వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు దుద్దాల దుర్గమ్మ (భర్త అశోక్), మహమ్మద్ షకీరా బేగం (భర్త యూసుఫుద్దీన్) గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని పూజలు నిర్వహించి ఇళ్లను ప్రారంభించారు. తరువాత నారాయణపూర్ గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రాజకీయాలకు అతీతంగా అందరికీ సమానంగా అభివృద్ధి ఫలాలు అందేలా కృషి చేయాలని సూచించారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రజాప్రతినిధులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలతో నిత్యం మమేకమై సేవాభావంతో పనిచేస్తే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యతగా ప్రజలకు సేవ చేయాలని, అధికారులు–ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఉచిత విద్య అందిస్తున్నామని, నమోదు పెంపొందించేందుకు బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## ఆరు గ్యారంటీల్లో కీలకం ఇందిరమ్మ ఇళ్ల పథకం – అర్హులందరికీ ఇళ్లు అందిస్తాం: మంత్రి వివేక్ వెంకటస్వామి

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 26, ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ఒకటని తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు మరియు భూగర్భ శాస్త్ర శాఖల మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. నర్సాపూర్ మున్సిపాలిటీలో నూతనంగా నిర్మించిన రెండు ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలను లబ్ధిదారులతో కలిసి ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇందిరాగాంధీ కాలంలో 'గరీబీ హటావో' నినాదంతో పేదలకు ఇళ్లు నిర్మించిన చరిత్ర ఉందని, 2009లో కాంగ్రెస్ ప్రభుత్వం లబ్ధిదారులకు లక్ష రూపాయలు అందజేసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని గుర్తుచేశారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల కోసం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పునఃప్రారంభించిందని పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చి పది సంవత్సరాలు ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ప్రస్తుతం నర్సాపూర్ నియోజకవర్గంలో 3,500 ఇళ్ల నిర్మాణం జరుగుతోందని, అందులో 192 ఇళ్ల పనులు కొనసాగుతున్నాయని, ఇప్పటికే 100 ఇళ్లు పూర్తయ్యాయని త్వరలో అన్నీ ప్రారంభిస్తామని తెలిపారు. మొదటి దఫాలో ఇళ్లు రాని అర్హులకు వచ్చే సంవత్సరం మరో 2,500 ఇళ్లు మంజూరు చేస్తామని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే సామర్థ్యం లేని వారికి కాంగ్రెస్ కార్యకర్తలు సహకరించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఐదేళ్లలో 17 లక్షల ఇళ్లు నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని, అందరూ సహకరించాలని కోరారు. నర్సాపూర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని 100 శాతం అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు. 600 చదరపు అడుగుల లోపు స్థలంలో ఇల్లు నిర్మిస్తే బిల్లులు త్వరగా మంజూరు అవుతాయని, బిల్లుల సమస్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రెండు రోజుల్లో కలెక్టర్‌తో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీరాజ్ యాదవ్, గ్రంథాలయ చైర్మన్ చిలెమల సుహాసినిరెడ్డి, ఆర్డీవో రమాదేవి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సర్మన్ కుంట తాండలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం – రైతులకు మద్దతుగా ముందుకు వచ్చిన సహకార సంఘం



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 26, ప్రతినిధి: మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలో రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో సర్మన్ కుంట తాండలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి టేక్మాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మ రమేష్ ముఖ్య అతిథిగా హాజరై కేంద్రాన్ని ప్రారంభించి రైతులకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వం, సహకార సంఘాలు కలిసి పనిచేయాలని తెలిపారు. ఈ సందర్భంగా రైతులు తమ పంటలకు సరైన ధర లభించేలా కొనుగోలు కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్మన్ కుంట సర్పంచ్ దేవిక రంగులాల్, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ కమిటీ చైర్మన్ షేక్ మజహర్, సీఈఓ వెంకటేష్, సంగ్యా జీపీ సర్పంచ్ సక్కురు నాయక్, కాంగ్రెస్ నాయకులు తారా సింగ్, శంకర్, ప్రభు, హరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జనగణన–2027లో స్వయంగా నమోదు సౌకర్యాన్ని వినియోగించుకోవాలి: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపు



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 26, ప్రతినిధి: భారత ప్రభుత్వం ప్రతి పదేళ్లకు ఒకసారి నిర్వహించే జాతీయ జనగణన కార్యక్రమం 2027 ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈసారి అందుబాటులోకి వచ్చిన డిజిటల్ సెల్ఫ్ ఎన్యూమరేషన్ విధానాన్ని జిల్లా ప్రజలు తప్పనిసరిగా వినియోగించుకోవాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో భాగంగా డిజిటల్ ఇండియా కార్యక్రమంలో రూపొందించిన ఈ సౌకర్యం ద్వారా ప్రజలు తమ ఇంటి వివరాలు, కుటుంబ సభ్యుల సమాచారం వంటి అంశాలను ఆన్‌లైన్‌లోనే సులభంగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఇందుకు ప్రత్యేకంగా రూపొందించిన వెబ్ పోర్టల్ https://se.census.gov.in/ ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని పేర్కొంటూ, ముందుగా పోర్టల్‌లోకి వెళ్లి తమకు నచ్చిన భాషను ఎంపిక చేసుకుని మొబైల్ నంబర్ ద్వారా ఓటీపీ సహాయంతో లాగిన్ కావాలని, అనంతరం జిల్లా, పిన్ కోడ్, గ్రామం వివరాలను ఎంపిక చేసి మ్యాప్‌లో తమ నివాసాన్ని గుర్తించి ప్రశ్నలకు సమాధానాలు నమోదు చేసి సమర్పించాలని సూచించారు. చివరగా మొబైల్‌కు వచ్చే ఎస్ఈ ఐడీని భద్రపరచుకోవాలని తెలిపారు. జనగణనలో భాగంగా ఇంటి నిర్మాణం, వసతి సౌకర్యాలు, కుటుంబ సభ్యుల సంఖ్య, విద్యుత్, నీటి వనరులు, మరుగుదొడ్డి సదుపాయం, వంట ఇంధనం, ఇంటర్నెట్ వినియోగం, వాహనాల వివరాలు వంటి ముఖ్యమైన సమాచారం నమోదు చేయాల్సి ఉంటుందని చెప్పారు. ప్రజలు ఆన్‌లైన్‌లో నమోదు చేసినప్పటికీ ప్రభుత్వం నియమించిన ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటిని సందర్శించి వివరాలను ధృవీకరిస్తారని, ఆ సమయంలో ఎస్ఈ ఐడీని చూపించి సహకరించాలని కోరారు. జనగణన ద్వారా సేకరించిన సమాచారంతో ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతుందని పేర్కొంటూ ప్రతి కుటుంబం ఈ ప్రక్రియలో పాల్గొని సరైన వివరాలు నమోదు చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# అల్లాదుర్గం మండల సమస్యలపై మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసిన కాంగ్రెస్ నాయకులు



సందేశం టైమ్స్, మెదక్/అల్లాదుర్గం, ఏప్రిల్ 26, ప్రతినిధి: అల్లాదుర్గం మండల సమస్యల పరిష్కారం కోసం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రాష్ట్ర వైద్య, ఆరోగ్య మరియు సైన్స్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిశారు. అల్లాదుర్గ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి రాంపూర్ నివాసంలో జరిగిన సమావేశంలో సర్పంచ్లు, సీనియర్ నాయకులు పాల్గొని మండలంలోని పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సమస్యలను శ్రద్ధగా విని పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సుభాష్ రావు, డిసిసి జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహా రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బాలరాం, బీసీ సెల్ మండల అధ్యక్షుడు నర్సింలు, మండల ఉపాధ్యక్షుడు సాయిబాబా, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జైపాల్, గ్రామ అధ్యక్షుడు సాయిలు, సర్పంచులు శేశి రెడ్డి, వీరన్న, సంజీవరెడ్డి, బాలరాజ్, రఘుపతి, సురేష్ సెట్, ప్రభు, బేతయ్య, కొంక శ్రీశైలం, శీను, సంగమేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.



# ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపిన జగన్నాధపురం, నరసింహపురం గ్రామ ప్రజలు – రూ.2.50 కోట్ల బీటీ రోడ్డుకు ఏర్పాట్లు



సందేశం టైమ్స్, చింతకాని, ఏప్రిల్ 26, ప్రతినిధి: జగన్నాధపురం మరియు నరసింహపురం గ్రామాల అభివృద్ధికి కీలకంగా నిలిచే బీటీ రోడ్డుకు చర్యలు చేపట్టినందుకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. జగన్నాధపురం గ్రామంలోని బీసీ కాలనీ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహం నుంచి నరసింహపురం రైల్వే అండర్ బ్రిడ్జి వరకు సుమారు రూ.2 కోట్లు 50 లక్షల వ్యయంతో బీటీ రోడ్డును నిర్మించేందుకు పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఎస్టిమేషన్ సిద్ధం చేస్తున్నారు. రైతులు తమ పొలాలకు వెళ్లడానికి, వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించడానికి పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ రహదారి నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. వర్షాకాలంలో బురదమయంగా మారుతున్న దారి కారణంగా ట్రాక్టర్లు సైతం వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుండగా, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రోడ్డు వెడల్పు, కల్వర్టుల అవసరాలను గుర్తించి మ్యాపింగ్ చేశారు. ప్రత్యేక నిధులతో పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, పరిశీలన నివేదికను ఉన్నతాధికారులకు పంపించి త్వరలోనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రవాణా ఇబ్బందులు లేకుండా త్వరితగతిన రహదారి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నన్నక శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బందెల నాగార్జున, జగన్నాధపురం గ్రామ సర్పంచ్ తాళ్ళూరి స్వప్న రమేష్, నరసింహపురం గ్రామ సర్పంచ్ లోయ ఉపేందర్, వార్డ్ సభ్యులు తోటకూర హరీష్, గమిడి శ్రీను, రైతులు తోటకూరి అప్పారావు, బండి సైదేశ్వరావు, బండారుపల్లి మురళి, తోటకూరి సైదేశ్వరావు, తన్నీరు పుల్లారావు, దొడ్డ అచ్చయ్య, లంజపల్లి శ్రీను, కర్రీ వెంకటేశ్వర్లు, అలవాల వెంకటేశ్వర్లు, అలవాల నాగేశ్వరరావు, గమిడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అల్లాదుర్గం మండల సమస్యలపై మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసిన కాంగ్రెస్ నాయకులు

సందేశం టైమ్స్, మెదక్/అల్లాదుర్గం, ఏప్రిల్ 26, ప్రతినిధి: అల్లాదుర్గం మండల సమస్యల పరిష్కారం కోసం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రాష్ట్ర వైద్య, ఆరోగ్య మరియు సైన్స్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిశారు. అల్లాదుర్గ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి రాంపూర్ నివాసంలో జరిగిన సమావేశంలో సర్పంచ్లు, సీనియర్ నాయకులు పాల్గొని మండలంలోని పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సమస్యలను శ్రద్ధగా విని పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సుభాష్ రావు, డిసిసి జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహా రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బాలరాం, బీసీ సెల్ మండల అధ్యక్షుడు నర్సింలు, మండల ఉపాధ్యక్షుడు సాయిబాబా, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జైపాల్, గ్రామ అధ్యక్షుడు సాయిలు, సర్పంచులు శేశి రెడ్డి, వీరన్న, సంజీవరెడ్డి, బాలరాజ్, రఘుపతి, సురేష్ సెట్, ప్రభు, బేతయ్య, కొంక శ్రీశైలం, శీను, సంగమేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు రెట్రో ఫిట్‌మెంట్ స్కూటీలు అంగన్వాడీ టీచర్లకు 5జీ స్మార్ట్ ఫోన్ల పంపిణీ





సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 26, ప్రతినిధి: దివ్యాంగులు, వయోవృద్ధులు మరియు ట్రాన్స్ జెండర్ వ్యక్తుల సాధికారిత శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ దివ్యాంగులు సహకార సంస్థ ద్వారా జిల్లాలోని దివ్యాంగులకు స్వయం ఆధారిత జీవనం కల్పించేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో తెలంగాణ ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా సూర్యాపేట నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు దివ్యాంగుల రెట్రో ఫిట్‌మెంట్ స్కూటీలు మరియు అంగన్వాడీ టీచర్లకు 5జీ స్మార్ట్ ఫోన్లను రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదితతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు, మహిళలు ఆత్మవిశ్వాసంతో స్వశక్తితో ముందుకు సాగాలని, అంగన్వాడీ మహిళలు అందించిన స్మార్ట్ ఫోన్లను వినియోగించి తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు చిన్నారులకు ఆటలు, పాటలు, రైమ్స్ నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వేనారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ షఫీ ఉల్లా, ఆర్డీవో వేణుమాధవ్, ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, సంక్షేమ అధికారి కె. నరసింహారావు, దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ ముట్టినేని వీరయ్య, అధికారులు, సీడీపీవో, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, జిల్లా ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం కలెక్టర్ బదిలీ – నూతన కలెక్టర్‌గా దివాకర్ నియామకం





సందేశం టైమ్స్, ఖమ్మం, ఏప్రిల్ 26, ప్రతినిధి: ఖమ్మం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్‌గా ఉన్న అనుదీప్ దురిశెట్టి, ఐఏఎస్ (2018 బ్యాచ్) బదిలీ అయ్యారు. ఆయనను ఐటీ, ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్స్ (ఐటీఈ&సీ) శాఖలో ప్రభుత్వ జాయింట్ సెక్రటరీగా నియమించడంతో పాటు మైన్స్ & జియాలజీ డైరెక్టర్ మరియు తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎండీసీ) వైస్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇదిలా ఉండగా ఖమ్మం జిల్లా నూతన కలెక్టర్‌గా దివాకర్‌ను ప్రభుత్వం నియమించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ మార్పులు పరిపాలనలో మరింత సామర్థ్యం, పారదర్శకత పెంపునకు దోహదపడతాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

# ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు – మలేరియా నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం కీలకం: డీఎంహెచ్ఓ డా. పెండెం వెంకట రమణ

సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 26, ప్రతినిధి: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రాజీవ్ నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో జిల్లా స్థాయి ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. పెండెం వెంకట రమణ మాట్లాడుతూ మలేరియా నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ ఏడాది మలేరియా దినోత్సవాన్ని "మలేరియా నిర్మూలనకు కృషి: ఇప్పుడు మనం చేయగలం, ఇప్పుడు చేయాలి" అనే నినాదంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇళ్ల చుట్టూ కొబ్బరి బోండాలు, ప్లాస్టిక్ బాటిల్లు, గ్లాసులు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మురుగు కాలువల్లో ఆయిల్ బాల్స్ వేయడం, దోమతెరలు వినియోగించడం ద్వారా మలేరియాను నివారించవచ్చని సూచించారు. చలితో కూడిన జ్వరం వచ్చిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్ష చేయించుకోవాలని, అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా మలేరియా పరీక్షలు మరియు చికిత్స అందుబాటులో ఉన్నాయని తెలిపారు. క్లోరోక్విన్ ఔషధం ప్రభావవంతంగా పనిచేస్తుందని, వైద్యుల సలహా మేరకు సరైన మోతాదులో తీసుకోవాలని సూచించారు. సూర్యాపేట జిల్లాలో చివరి మలేరియా కేసు మార్చి 2026లో నమోదైందని, 2030 నాటికి మలేరియా పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ డా. జి చంద్రశేఖర్, మలేరియా ప్రోగ్రాం అధికారి డా. జి ప్రసిద్ధ, ఎంహెచ్ఎన్ ప్రోగ్రాం అధికారి డా. నాజియా, వైద్యాధికారిణి డా. వాసవి, డీపీఓ ఉమా మహేశ్వరి, డిప్యూటీ డెమో వి. సంజీవ్ రెడ్డి, యస్. వీరయ్య, హెచ్ఈ శ్రీదేవి, ఏఎంఓ మోతీలాల్, ఎపిడేమియోలజిస్ట్ సత్తయ్య, డీపీఎంఓలు కృష్ణయ్య, ఆనంద్, సురేష్, సబ్ యూనిట్ అధికారులు సముద్రాల సురేందర్, రామకృష్ణ, సిహెచ్ఓ శ్రీనివాసరాజు, ఏఎస్ఓ మత్స్యగిరి, యూపిహెచ్‌సీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం మలేరియా నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు.

# గిరిజన విద్యార్థులకు సమ్మర్ క్యాంప్ – శిక్షణ కోసం హైదరాబాద్‌కు రవాణా ప్రారంభం


సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 26, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా గిరిజన విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కె. శంకర్ కోరారు. హైదరాబాద్ పట్టణంలోని బోయినపల్లి ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో నిర్వహించనున్న ఈ సమ్మర్ క్యాంప్‌కు సూర్యాపేట జిల్లా ప్రభుత్వ గిరిజన వసతి గృహాల విద్యార్థులను పంపేందుకు కలెక్టరేట్ ఆవరణలో శుక్రవారం వాహనాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏప్రిల్ 25 నుంచి మే 9 వరకు 15 రోజుల పాటు జరిగే ఈ శిబిరంలో విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణతో పాటు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, డాన్స్, సింగింగ్, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రత్యేక శిక్షణ అందించబడుతుందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారులు కె. లింగయ్య, కె. కవిత, కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్, ప్రియాంక, శివరాజ్, నాగరాజ్, సైదా నాయక్, దేవ తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టులకు భారీ దెబ్బ – 47 మంది లొంగుబాటు, బెటాలియన్-1 నిర్వీర్యం



సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రతినిధి: మావోయిస్టు ఉద్యమానికి గట్టి దెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్ బెటాలియన్-1 కు చెందిన కమాండర్ హేమ్లా విజ్జ అలియాస్ ఐతుతో పాటు మొత్తం 47 మంది మావోయిస్టులు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా వారు 32 ఆయుధాలతో పాటు ల్యాండ్ మైన్ల తయారీలో వినియోగించే వైర్లను పోలీసులకు అప్పగించారు. ఈ లొంగుబాటుతో బెటాలియన్-1 పూర్తిగా నిర్వీర్యమైందని డీజీపీ వెల్లడించారు. లొంగిపోయిన వారిలో తెలంగాణకు చెందిన వారు ఎవరూ లేరని, అయితే గతంలో రాష్ట్రంలో కార్యకలాపాలు నిర్వహించినట్లు తెలిపారు. లొంగుబాటుకు సహకరించిన స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ పోలీసుల కృషిని ఆయన ప్రశంసించారు. లొంగిపోయిన వారికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల పునరావాస పథకాలను అమలు చేస్తామని తెలిపారు. 2026 సంవత్సరంలో ఇప్పటివరకు తెలంగాణలో 260 మంది మావోయిస్టులు లొంగిపోయారని, రాష్ట్రానికి చెందిన నలుగురు మాత్రమే ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని డీజీపీ పేర్కొన్నారు.

## సంగారెడ్డిలో నూతన జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ప్రారంభం



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 26, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా కోర్టు ప్రాంగణంలో నూతన అదనపు జూనియర్ సివిల్ జడ్జి మరియు అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టును తెలంగాణ హైకోర్టు గౌరవ న్యాయమూర్తి, జిల్లా పరిపాలనా న్యాయమూర్తి సురేపల్లి నంద ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి అనిల్ కుమార్ జుకంటి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి జి. భావాని చంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ కోర్టులో పటాన్‌చెరు, బీడీఎల్ భానూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని కేసుల విచారణ జరుగుతుందని, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్‌గా అమిషి జగియన్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తారని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు, న్యాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## మే 9న ప్రధాని మోదీ తెలంగాణ పర్యటన – పరేడ్ గ్రౌండ్‌లో భారీ సభకు ఏర్పాట్లు




సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రతినిధి: ప్రధాని నరేంద్ర మోదీ మే 9న తెలంగాణలో పర్యటించనున్నట్లు ఖరారైంది. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్న ఆయన అనంతరం హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభలో పాల్గొననున్నారు. మూడోసారి ప్రధాని అయిన తర్వాత మోదీ తెలంగాణ పర్యటన ఇదే తొలిసారి కావడంతో ఈ టూర్‌ను రాష్ట్ర బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సభ విజయవంతం కోసం పార్టీ శ్రేణులు ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభించాయి. ఇటీవల అంతర్గత సమస్యలతో సతమతమవుతున్న రాష్ట్ర బీజేపీకి ఈ పర్యటన కొత్త ఉత్సాహాన్ని నింపే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

## సీపీఎస్ రద్దు, ఓపీఎస్ పునరుద్ధరణకు విజ్ఞప్తి కేంద్ర మంత్రి బండి సంజయ్ సానుకూల స్పందన



సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రతినిధి: దేశవ్యాప్తంగా సీపీఎస్ విధానాన్ని తక్షణమే రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర కార్యదర్శి మున్నూరు అంజన్న, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చి. రాంచందర్ కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ ఈ అంశంపై కేంద్ర స్థాయిలో చర్చలు కొనసాగుతున్నాయని, ఉద్యోగుల ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకునే దిశగా చర్యలు జరుగుతున్నాయని తెలిపారు. త్వరలోనే ఈ విషయంపై శుభవార్త వచ్చే అవకాశముందని సానుకూలంగా స్పందించారు.

## శంకరంపేట్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం – రైతులకు మద్దతు ధరలతో భరోసా: ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి



సందేశం టైమ్స్, శంకరంపేట్, ఏప్రిల్ 26, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం శంకరంపేట్ మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేస్తూ, గ్రేడ్-ఎ వరికి క్వింటాల్‌కు రూ.2389, సాధారణ రకానికి రూ.2369 మద్దతు ధరతో నేరుగా కొనుగోలు జరుగుతుందని తెలిపారు. రైతులు మధ్యవర్తుల బారిన పడకుండా పారదర్శకంగా, వేగవంతంగా ధాన్యం కొనుగోలు జరిగేలా ఈ కేంద్రాలు కీలకంగా పనిచేస్తాయని పేర్కొన్నారు. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని సిద్ధం చేసి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతు సంక్షేమానికి వెటర్నరీ వైద్యుల సేవలు కీలకం – ప్రపంచ పశువైద్య దినోత్సవం సందర్భంగా ఘన సన్మానం



సందేశం టైమ్స్, మనూర్, ఏప్రిల్ 26, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం మానూర్ మండలం బోరంచ గ్రామ వెటర్నరీ వైద్యుల కార్యాలయంలో శనివారం ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు బైండ్ల కృష్ణ వెటర్నరీ వైద్యులను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పశుసంవర్ధక రంగ అభివృద్ధిలో వెటర్నరీ వైద్యుల సేవలు అత్యంత కీలకమని, రైతు కుటుంబాల ఆర్థిక స్థిరత్వానికి వారి పాత్ర అమూల్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ పంచగామ బీరప్ప, ఉపసర్పంచ్ మొల్ల కరిమ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతోష్ ముఖ్య అతిథులుగా హాజరై వైద్యుల సేవలను అభినందించారు. గ్రామ ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని వెటర్నరీ వైద్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

## మండల పంచాయతీ కార్యదర్శుల ఫోరం అధ్యక్షుడిగా నర్మల సంతోష్ ఎన్నిక – అభినందనలు వెల్లువ



సందేశం టైమ్స్, మనూర్ మండలం, ఏప్రిల్ 26, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం మానూర్ మండలం బోరంచ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మండల పంచాయతీ కార్యదర్శుల ఫోరం అధ్యక్షుడిగా నర్మల సంతోష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ జిల్లా అధ్యక్షుడు బైండ్ల కృష్ణ ఆయనను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. గ్రామాభివృద్ధి, ప్రజాసేవలో మరింత సమర్థవంతంగా పనిచేసి ప్రజలకు మరింత సేవ చేయాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమానికి సర్పంచ్ పంచగామ బీరప్ప, ఉపసర్పంచ్ మొల్ల కరిమ్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఇతర ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఉత్తమ యాజమాన్య అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం – మేడే ఉత్సవాల్లో ప్రదానం: ఉప కార్మిక కమిషనర్ కె. రవీందర్ రెడ్డి

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 26, ప్రతినిధి: కార్మిక దినోత్సవం సందర్భంగా మే 1 నుండి 10 వరకు మేడే ఉత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా ఉప కార్మిక కమిషనర్ కె. రవీందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని పరిశ్రమల యాజమాన్యాలు కార్మికుల సంక్షేమం కోసం చేపడుతున్న చర్యలను ప్రోత్సహించేందుకు "ఉత్తమ యాజమాన్య అవార్డులు" ప్రదానం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్మికుల భద్రతా చర్యలు, సంక్షేమ కార్యక్రమాలు, మహిళల కోసం ప్రత్యేక పథకాలు, స్థానికులకు ఉద్యోగావకాశాల కల్పనతో పాటు సామాజిక బాధ్యత కింద చేపడుతున్న కార్యక్రమాల ఆధారంగా ఈ అవార్డులు ఎంపిక చేయబడతాయని తెలిపారు. ఈ అవార్డులను మే 1న మేడే రోజున జిల్లా కేంద్రంలో అందజేయనున్నట్లు చెప్పారు. అర్హత గల యాజమాన్యాలు తమ దరఖాస్తులను ఈ నెల 27వ తేదీ లోపు సమర్పించాలని ఆయన సూచించారు. దరఖాస్తు ఫారమ్ కోసం ఉప కార్మిక కమిషనర్ కార్యాలయం, సంగారెడ్డి లేదా dcisrd@gmail.com ద్వారా సంప్రదించవచ్చని, 9492555304, 9492555307 నంబర్లలో సమాచారం పొందవచ్చని తెలిపారు.

## ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ర్యాలీ – ప్రజల్లో అవగాహన పెంపునకు పిలుపు: జిల్లా వైద్యాధికారి డా. వసంతరావు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 26, ప్రతినిధి: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని 25-04-2026న మలేరియా నిర్మూలన లక్ష్యంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, నర్సింగ్ మరియు పారా మెడికల్ కళాశాలల విద్యార్థులచే అవగాహన ర్యాలీ మరియు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ పాండు హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ జిల్లా పరిషత్ కార్యాలయం నుండి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి జిల్లా వైద్యాధికారి డా. వసంతరావు అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 25న ప్రపంచ మలేరియా దినోత్సవం నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించడం జరుగుతోందని, ప్రాణాంతకమైన మలేరియా వ్యాధి నివారణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని తెలిపారు. వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, నీరు నిల్వ ఉండకుండా చూడడం, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించడం, దోమతెరలు వినియోగించడం ద్వారా మలేరియాను నివారించవచ్చని సూచించారు. జ్వరం, తలనొప్పి, శరీర నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ వైద్య కేంద్రాలను సంప్రదించి రక్తపరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. రక్తపరీక్షల ద్వారా మలేరియా వ్యాధి నిర్ధారణ సులభమని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డా. ప్రవీణ్, జిల్లా ఆరోగ్య విద్యాధికారి శ్రీనివాసరావు, హెల్త్ ఎడ్యుకేటర్ మంగమ్మ, ఆరోగ్య విస్తరణాధికారి వీరేశం, ఇతర వైద్య సిబ్బంది, ఆందోల్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం మలేరియా వ్యాధిపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు.

## నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట – రైతులకు నాణ్యమైన విత్తనాలే లక్ష్యం: విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి




సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 26, ప్రతినిధి: రైతులకు నమ్మకమైన, అధిక దిగుబడిని ఇచ్చే నాణ్యమైన విత్తనాలను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి స్పష్టం చేశారు. సంగారెడ్డి జిల్లా ఐడీఓసీ సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ అధికారులు, విత్తన డీలర్లు, సహకార సంఘాలు, ఎఫ్పీఓ ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. "యదా బీజం తదా సస్యం" అనే సూత్రాన్ని ప్రస్తావిస్తూ నాణ్యమైన విత్తనాల ప్రాముఖ్యతను వివరించారు. జిల్లాలో పత్తి, వరి, జొన్న, సోయాబీన్, కందులు, మినుములు వంటి పంటల సాగు విస్తృతంగా జరుగుతున్న నేపథ్యంలో రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కల్తీ విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, దీనిని అరికట్టడంలో అందరి బాధ్యత ఉందని తెలిపారు. వరి సాగుతో పాటు రైతులు పెసర, కంది, మినుము, శనగ, వేరుశనగ, నువ్వులు వంటి లాభదాయకమైన పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌కు జిల్లాలో విత్తనాల కొరత లేదని, బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, కెఎన్ఎం 1638 వంటి సన్న రకాలు, అలాగే కెఎస్ఎం 118, ఎమ్ఐటియు 1010 వంటి దొడ్డు రకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి కె. శివప్రసాద్ మాట్లాడుతూ నకిలీ విత్తనాల విక్రయంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు సంబంధించి కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని, ప్రతి నెలా స్టాక్ రిపోర్టులు సమర్పించాలన్నారు. డీఎస్పీ సత్తయ్య గౌడ్ మాట్లాడుతూ నకిలీ విత్తనాలపై ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబర్ 8712656777ను ఉపయోగించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, వ్యవసాయ విభాగ ప్రతినిధులు, డీలర్లు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.